క్లుప్తంగా

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జీఎం కృష్ణయ్య

ఇల్లెందు: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఏరియా అధికారులకు జీఎం వీసం కృష్ణయ్య కోరారు. ఆదివారం తన చాంబర్‌లో మాట్లాడుతూ... జూన్ 2న గనులు, కార్యాలయాల్లో జాతీయ జెండాలు అవనతం చేయాలని, తోరణాలు, కొబ్బరి ఆకులు కట్టి పండుగ వాతావరణం సృష్టించాలని కోరారు. తెలంగాణ పరుగులో కార్మికులు, ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. సాయంత్రం జేకే కాలనీలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఎస్‌ఓటూ జీఎం రామస్వామి, అధికారులు గిరిధర్‌రావు, కృష్ణమోహన్, రవికుమార్, జీవీ మోహన్‌రావు, పవన్‌కుమార్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

టేకులపల్లి: ఇల్లెందు ఏరియా జీఎం వీసం కృష్ణయ్య ఆదివారం కోయగూడెం ఓపెన్‌కాస్టుని సందర్శించారు. కేటీసీ నైట్ షిఫ్ట్ కార్మికులతో ఉదయం 6 గంటలకు ఎలాంటి హంగూ, ఆర్భాటం లేకుండా కార్మికులతో కలిసి అల్పాహారం చేశారు. పలు విషయాలపై సూచనలు చేస్తూ చర్చించారు. బొగ్గు ఉత్పత్తులపై దృష్టి సారించాలని, ఇల్లెందును బొగ్గు ఉత్పత్తిలో నంబర్ వన్ స్థానంలో ఉండే విధంగా కృషి చేయాలని అధికారులకు సూచనలు చేశారు.

ఘనంగా స్వేరోస్ విక్టరీ డే



అభివాదం తెలుపుతున్న నాయకులు

పాల్వంచ: పట్టణంలో ఆదివారం ఘనంగా స్వేరోస్ విక్టరీ డే ఉత్సవాలు నిర్వహించారు. స్థానిక గుట్టపై స్వేరోస్ జెండా, జాతీయ జెండాను స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షుడు చిలకబత్తిని వీరయ్య ఎగురవేశారు. మాట్లాడుతూ.. దళిత, బహుజన సమాజం, సామాజిక న్యాయ పోరాటంలో స్వేరోస్ కీలకంగా కృషి చేస్తోందన్నారు. అతిచిన్న వయసులో మాలావత్ పూర్ణ, సాధనపల్లి ఆనంద్ 2014 మే 25న ఎవరెస్ట్ ఎక్కిన రోజును ప్రపంచ వ్యాప్తంగా విక్టరీ డే జరుపుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రవీందర్, కొత్తపల్లి శ్రీనివాస్, అశోక్, ఇసనపల్లి నాగరాజు, విష్ణు, రాము, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై విరిగి పడిన వృక్షం



రాజు తండా సమీపంలో విరిగి పడిన చెట్టు

టేకులపల్లి: ఈదురు గాలులకు ఆదివారం ఇల్లెందు – కొత్తగూడెం ప్రధాన రహదారి టేకులపల్లి మండలం రాజుతండా సమీపంలో భారీ వృక్షం విరిగి ప్రధాన రహదారిపై పడింది. భారీగా వాహనాలు నిలిచిపోవడంతో సుమారు గంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. టేకులపల్లి ఎస్‌ఐ రాజేందర్ ఆధ్వర్యంలో పోలీసులు స్థానికుల సహకారంతో జేసీబీ, కటింగ్ మిషన్లు తెప్పించి చెట్టును ముక్కలు చేసి తొలగించారు. ట్రాఫిక్ క్లియర్ కావడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

భక్తుల కొంగుబంగారం
అంకమ్మతల్లి

- నేటి నుంచి వారం రోజుల జాతర
- వేలాది మంది భక్తుల రాక



రాఘవాపురంలోని దేవాలయం (ఇన్‌సెట్) అంకమ్మతల్లి

సుజాతనగర్: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం అంకమ్మతల్లి. రాఘవాపురం గ్రామంలోని అమ్మవారి జాతరకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. గ్రామంలో కరువు, కాటకాలు లేకుండా ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలంటే అమ్మవారి దయ వలనే అవుతుందని గ్రామస్తులు నమ్ముతారు. ప్రతీ రెండేళ్లకోసారి గ్రామంలో అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవారి జాతరను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సోమవారం నుంచి జూన్ 2వ తేదీ వరకు గ్రామంలో వైభవంగా అంకమ్మతల్లి జాతర జరగనుంది.

అమ్మవారి చరిత్ర...

గ్రామంలో కొలువైన అమ్మవారికి సుమారు 300 ఏళ్ల చరిత్ర ఉంది. ఒకప్పుడు ఈ గ్రామం కరువు కాటకాలతో అల్లాడుతున్న సమయంలో గ్రామానికి చెందిన దారా వంశస్తులు బూర్గంపాడులో జరిగిన ఓ వివాహానికి వెళ్లారట. ఆ సమయంలో అక్కడ జరిగిన అంకమ్మతల్లి ఉత్సవాల సందర్భంగా రాత్రి వేళలో సదరు దంపతులకు అంకమ్మతల్లి కలలో ప్రత్యక్షమైంది. తమ గ్రామంలో అంకమ్మతల్లిని ప్రతిష్ఠించుకుంటే గ్రామ సమస్యలు తొలగిస్తానని చెప్పినప్పటికీ దంపతులు పట్టించుకోకపోవడంతో ఆ ఏడాది గ్రామంలో వ్యాధులు ప్రబలాయని అంటుంటారు. ఆ తరువాత అమ్మవారిని ప్రతిష్ఠించాలని ఓ రుషి కూడా చెప్పడంతో నాటి నుంచి అమ్మవారిని నెలకొల్పి పూజలు చేస్తుంటారని చరిత్ర చెబుతోంది.

మూడు కిలోమీటర్ల దూరంలో...

సుజాతనగర్ నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో రాఘవాపురం గ్రామం ఉంది. ఈ నెల 26వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు వారం రోజుల పాటు అంకమ్మతల్లి జాతరను అత్యంత భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించనున్నారు. జాతర మహోత్సవానికి సుమారు 50 వేల మంది భక్తులు వస్తారని అంచనా. భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకొని పోలీసులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

అత్యంత భక్తిశ్రద్ధలతో...

అంకమ్మతల్లి జాతరలో ముఖ్యమైన ఘట్టాలైన కొల బియ్యం, వీరతాడు, అనంత బండారు, వసంతోత్సవం, కొర్లబండి, పూలకప్పెర తదితర కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధతో నిర్వహిస్తారు. అనంతరం అమ్మవారిని కొర్లబండిపై సాగనంపుతారు. ఈ జాతరలో వీరతాడు, వసంతోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. జాతరలో మూడు రోజుల పాటు ప్రత్యేకంగా పూజించిన బియ్యాన్ని ప్రతీరోజు కొలుస్తుంటారు. చివరి రోజు రెట్టింపు బియ్యం అవుతాయి. అమ్మవారు దీవెనలతోనే బియ్యం రెట్టింపు అవుతాయని, పాడి పంటలు సమృద్ధిగా పండుతాయని భక్తులు నమ్ముతారు.

మహిమ గల అమ్మవారు...



అంకమ్మ ఎంతో మహిమగల తల్లి. భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా వెలుగొందుతోంది. ప్రతీ రెండేళ్లకు ఒకసారి ఈ జాతరను భక్తిశ్రద్ధలతో చేస్తుంటాం.

– లోశెట్టి నాగార్జున్, రాఘవాపురం

భక్తిశ్రద్ధలతో పూజలు..



మే 26 నుంచి జూన్ 2 వరకు నిర్వహించబోయే జాతరలో భక్తిశ్రద్ధలతో పూజలు జరుగుతాయి. అమ్మవారు కరుణిస్తేనే పాడి పంటలు సమృద్ధిగా పండుతాయని అందరి నమ్మకం.

– పెంటి వెంకటేశ్వర్లు, రాఘవాపురం

ఏర్పాట్లు పూర్తి



వారం రోజుల పాటు నిర్వహించనున్న జాతర సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం.

– కోరుబోయిన రామారావు, పూజారి

ఐక్యతతో హక్కులు సాధించుకుందాం..



మాట్లాడుతున్న మేకల మల్లిబాబుయాదవ్

ఇల్లెందు: యాదవులు ఐక్యతతో తమ హక్కులు సాధించుకోవాలని అఖిల భారత యాదవ మహాసభ గౌరవాధ్యక్షుడు, డీసీసీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ అన్నారు. ఆదివారం ఇల్లెందులో జరిగిన పట్టణ యాదవ అడ్‌హక్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 100 ఏళ్లు నిండిన అఖిల భారత యాదవ మహాసభ దేశంలో రాజకీయాలను ప్రభావితం చేస్తోందన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు యాదవులు ఐక్యంగా పని చేస్తున్నారని తెలిపారు. దేశంలోని అన్ని యాదవ సంఘాలు ఈ యాదవ మహాసభలోకి రావాల్సిందేనన్నారు. ఐక్యమత్యంతో అనేక హక్కులు సాధించుకోవాల్సి ఉందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు అత్యధికంగా ఉన్నా.. అగ్రవర్ణాలు ఐక్యంగా ఉండటం వల్లే రాజ్యాధికారం సాధించుకుంటున్నారని పేర్కొన్నారు. రాబోవు మున్సిపల్ ఎన్నికల్లో యాదవులు అత్యధికంగా మున్సిపల్ కౌన్సిలర్ స్థానాలు కైవసం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదవ మహాసభ తాత్కాలిక కమిటీని ఎన్నిక చేశారు. గౌరవ సలహాదారుగా ప్రభునాథ్ యాదవ్, కన్వీనర్‌గా మారి రామలింగం యాదవ్‌లను ఎన్నుకున్నారు. చిలకల వెంకట నర్సయ్య, చేతల నాగేశ్వరరావు, పుట్టా ఉపేందర్, మొరి కోటయ్య, బండారీ ప్రభాకర్, దుంపటి రవి, వంగపండ్ల నాగరాజు, కావేటి రమేష్, కోడి రాజేందర్, మేకల నాగేశ్వరరావు, కాసాని రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల మూసివేత నిర్ణయం మానుకోవాలి

టేకులపల్లి: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని 12 ఇంటర్మీడియట్ గురుకులాలను విద్యార్థులు లేరనే నెపంతో సర్కారు మూసివేయాలని చూస్తోందని, ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనుకకు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి బయ్యా అభిమన్యు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ... ఈ గురుకులాలలో పేద, బలహీన వర్గాల నుంచి వచ్చిన విద్యార్థులు చదువుతున్నారని వారు విద్యకు దూరం అవుతారన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలను మూసి వేసి ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలకు కట్టబెట్టేలా రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు.

ఈ మూసివేసే విద్యాసంస్థలలో భద్రాచలం గురుకులం కూడా ఉందని ఏజెన్సీ ప్రాంత విద్యార్థులు ఇందులో చదువుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వమే వాటిని మూసివేయడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే వెనుకకు తీసుకోవాలని లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

సమాచార కమిషనర్‌కు సన్మానం



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న నాయకులు

పాల్వంచరూరల్: తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్‌గా నియమితులైన పీవీ శ్రీనివాస్ తొలిసారిగా ఆదివారం జిల్లాకు విచ్చేశారు. భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో పాల్వంచ పట్టణంలోని దమ్మపేట సెంటర్‌లో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు కమిషనర్‌ను కలిసి శాలువ, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పానిశెట్టి వెంకటేశ్వర్లు, జి.శంకర్, ఎం.ప్రశాంత్, ఎం.లక్ష్మణ్‌రావు, జి.రాజు, బి.అశోక్, రవి, కిట్టు, వెంకటేశ్, నరేందర్, రుద్ర, సన్నీ పాల్గొన్నారు.

జీపీలకు నిధులు విడుదల చేయండి..



మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

జూలూరుపాడు: గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జూలూరుపాడులో జరిగిన ఆ సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీలకు నిధులు లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందని, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిరంతరాయంగా జరగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలించేందుకు ట్రాక్టర్లు ప్రభుత్వం ఇచ్చినా డీజిల్‌కు గ్రామ పంచాయతీల్లో డబ్బులు లేకపోవడంతో నిర్వహణ ఇబ్బందిగా మారిందన్నారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు సక్రమంగా ఇవ్వకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం జీపీలకు నిధులు విడుదల చేయడంతోపాటు, సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాగరాజు చౌహాన్, రాంబాబు నాయక్, సేవియా నాయక్ పాల్గొన్నారు.

వడివడిగా.. ఇంకుడు గుంతల నిర్మాణం



సుభాష్‌నగర్ పాఠశాల ఆవరణలో ఇంకుడుగుంత తవ్వుతున్న పంచాయతీ సిబ్బంది

ఇల్లెందురూరల్: వృథా నీటిని భూమిలోపలికి చేర్చి భూగర్భ జలాలను వృద్ధి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అధిక సంఖ్యలో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించింది. జనాభా ప్రాతిపదికన ప్రతీ గ్రామపంచాయతీకి 50, రహదారుల వెంట 50కి తగ్గకుండా లక్ష్యాన్ని నిర్దేశించి ఇంకుడు గుంతల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. దీనికోసం పెద్దగా నిధులు ఖర్చు చేయకుండా గ్రామాలలోని నిర్మాణ వ్యర్థాలను వినియోగించి గ్రామపంచాయతీ సిబ్బంది ద్వారా నిర్మాణాలు చేపట్టాలని సూచించింది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో లక్ష్యాన్ని చేరుకోవడంలో ఇబ్బంది కలుగుతోందని భావించిన ఉన్నతాధికారులు గుంతలు తవ్వడానికి జేసీబీ వినియోగించేలా అనుమతి ఇచ్చారు. దీంతో మండలంలోని 29 గ్రామపంచాయతీలలో ఇంకుడు గుంతల నిర్మాణం వేగంగా సాగుతోంది. మండలంలో 2,596 నిర్మాణాలు లక్ష్యం కాగా 1,119 పూర్తి చేశారు. ఇంకా 1,477 నిర్మాణాలు చేపట్టాల్సి ఉందని ఎంపీఓ చిరంజీవి తెలిపారు. రానున్న రోజుల్లో పనులు మరింత వేగవంతం చేసి నిర్దేశించిన గడువులోగా ఇంకుడుగుంతల నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు.

ఆర్థిక సాయం

జూలూరుపాడు: అనంతారం గ్రామానికి చెందిన మల్కం వెంకటేశ్వర్లు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఆదివారం మృతుడి కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొర్సా రమేష్, ఉసికల వెంకటేశ్వర్లు, మల్కం వీరభద్రం, పుల్లారావు, పూనెం రాధాకృష్ణ పరామర్శించి రూ.5,000 అందజేశారు.

రాజమల్లుకు నివాళి

ఇల్లెందు: ఐఎన్‌టీయూసీ నేత చొప్పరి రాజమల్లు 14వ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఆదివారం ఇల్లెందులోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డానియేల్, వెంకటేశ్వర్లు, సుదర్శన్ కోరీ, గోచికొండ సత్యనారాయణ, ఇమామ్, మహబూబ్, నందకిషోర్, వత్సా వెంకటేశ్వర్లు, చల్లా శ్రీనివాస్, బోళ్ల సూర్యం, కంచర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయానికి ఏసీ వితరణ

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయానికి భక్తుల సౌకర్యార్థం లక్ష్మీదేవిపల్లికి చెందిన గోపాలకృష్ణ, హరికృష్ణ, వెంకన్న, సుజాత రూ.38 వేల విలువ గల ఏసీని వితరణగా అందజేసినట్లు ఆదివారం ఈఓ రజనీకుమారి తెలిపారు.



అటెన్షన్ ప్లీజ్

వాననీళ్లు కాదు.. భగీరథ నీరు





టేకులపల్లి మండలం తొమ్మిదోమైలు తండా డబుల్ బెడ్ రూం కాలనీలో నెలరోజుల క్రితం మిషన్ భగీరథ పైపు లీకైంది. ట్యాంకులకు నీరు వదిలినప్పుడల్లా తాగునీరంతా వృథా అవుతోంది. ఇళ్ల మధ్య చెరువును తలపిస్తోంది. సమస్యను సంబంధిత అధికారి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. పశువులు జలకాలాడుతున్నాయి. దోమల వృద్ధికి కేంద్రంగా తయారయింది. చెత్తచెదారం ఈ నీటిలో కొట్టుమిట్టాడుతోంది. దీంతో దుర్వాసన, దోమల బెడదతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి: కృష్ణకుమారి
తొమ్మిదోమైలు తండా పంచాయతీ కార్యదర్శి
సెల్ నంబర్: 9963658731

రిజిస్ట్రేషన్ల సమస్య తీరేనా?

- పాల్వంచ అభివృద్ధిపై ప్రభావం
- రిజిస్ట్రేషన్లు, పర్మిషన్ల నిలిపివేత
- 2016 నుంచి భూయజమానులకు తప్పని తిప్పలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా పటించుకోని పాలకులు



పాల్వంచలోని సర్వే నంబర్ 817 ఏరియా

పాల్వంచ: పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచ పట్టణాభివృద్ధికి రిజిస్ట్రేషన్ల సమస్య వెంటాడుతోంది. రిజిస్ట్రేషన్లను నిలిపివేయడంతో గృహ నిర్మాణాలు, క్రయవిక్రయాలు అరకొరగా నడుస్తున్నాయి. ఇప్పటికే రియల్ ఎస్టేట్ పూర్తిగా దెబ్బతినగా, పాల్వంచకు ఈ రిజిస్ట్రేషన్ల సమస్య మరింత శాపంగా మారింది.

పట్టణంలోని సర్వే నంబర్ 817, 444, 999, 727, 405లలో అసైన్‌మెంట్ పేరుతో 2016లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో ప్రభుత్వ బ్యాంక్‌లలో రుణాలు సైతం ఇవ్వడం లేదు. దీంతో ప్రైవేట్ బ్యాంక్‌ల ద్వారానే నిర్మాణాలు, కొనుగోళ్లకు రుణాలు తీసుకుంటున్నారు. ఇదిలా ఉండగా రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.

మందగించిన క్రయవిక్రయాలు...

పాల్వంచలో సగభాగం విస్తరించి ఉన్న ఈ ఐదు నంబర్లలో రిజిస్ట్రేషన్లు లేక భూక్రయ, విక్రయాలు మందగించాయి. సర్వే నంబర్ 999 (పేటచెరువు, పిల్లవాగు, కొత్తూరు, బంగారుజాల) 817 (శివనగర్, నెహ్రూనగర్, గాంధీనగర్, కాంట్రాక్టర్స్ కాలనీ, వెంకటేశ్వర హిల్స్ కాలనీ, జయమ్మ కాలనీ, వికలాంగుల కాలనీ, ఇందిరా కాలనీ), 444 (కలెక్టరేట్ ఎదురుగా ఉన్న నవభారత్ ఏరియా), 405 (నవభారత్, కేఎస్‌ఎం ఏరియా), 727 (ప్రశాంత్ కాలనీ, వెంగళరావు కాలనీ) తదితర ఏరియాల్లో రిజిస్ట్రేషన్లను ఆగిపోయాయి. దీంతో బ్యాంక్ రుణాలు నిలిచిపోయాయి. ఉద్యోగులు బ్యాంక్ ఈఎంఐల ద్వారానే గృహాలు కొనుగోళ్లు చేస్తుంటారు. వీరికి ఈ భూములు ఎంతో అనువైనప్పటికీ రుణాలు రాకపోవడంతో కొనలేక పోతున్నారు. బయట అప్పు చేసి కొంటే వడ్డీ రేట్లు అధికంగా ఉంటున్నాయి. దీంతో ఇతర పట్టణాలు, నగరాల్లో పెట్టుబడులు పెడుతున్నారు. హైదరాబాద్, ఖమ్మం నగరాలకు వలస వెళుతున్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికే కేటీపీఎస్ ఓఅండ్ఎం కర్మాగారం మూతబడటంతో సుమారు రెండువేల మంది ఉద్యోగులు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. ఈ కారణాలతో అభివృద్ధి నిలిచిపోయింది.

అవసరానికి ఆదుకోని స్థిరాస్తి...

అవసరానికి స్థిరాస్తిగా ఉన్న భూమిని అమ్మి పెళ్లిళ్లు, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, ఇతర అత్యవసరాలకు భూములు అమ్ముకోవాలంటే రిజిస్ట్రేషన్ లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇక స్థలాలు, ఇళ్ల ధరలు సైతం తగ్గిపోయాయి. ఈ భూములకు దశాబ్దాల కాలం పాటు ఎలాంటి ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ల జరగడంతో పాల్వంచ ప్రాంతం పెద్ద పెద్ద భవనాలతో ఎంతో అభివృద్ధి చెందింది. కానీ ఎనిమిదేళ్లుగా ఈ ఏరియాల్లో అభివృద్ధి కుంటుపడింది. మిగతా చోట్ల రిజిస్ట్రేషన్లు ఉండటంతో శరవేగంగా విస్తరణ జరుగుతోంది. ప్రస్తుత ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కూడా ఎన్నికల ప్రచారంలో ఈ సర్వే నంబర్లలో రిజిస్ట్రేషన్లను తిరిగి పునరుద్ధరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సైతం ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతున్నారు. స్థానిక ప్రజల ఇబ్బందులు, ప్రభుత్వ ఆదాయానికి తీరని నష్టం జరుగుతున్న నేపథ్యంలో పాలకులు, అధికారులు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధిపై ప్రభావం...



ఇప్పటికే కేటీపీఎస్ పాత ప్లాంట్ మూసివేయడంతో వేలాది మంది ఉద్యోగ, కార్మిక కుటుంబాలు పాల్వంచ వదిలి వెళ్లిపోయారు. ఇక రిజిస్ట్రేషన్లు సైతం కొన్ని సంవత్సరాలుగా నిలిచిపోవడంతో అభివృద్ధిపై ప్రభావం చూపుతోంది. దీంతో ఇతర సర్వే నంబర్లలో మాత్రమే క్రయవిక్రయాలు నడుస్తుండగా ఇక్కడ మాత్రం అంతంత మాత్రంగానే ఉంది.

– జి.శివ, పాల్వంచ

పాలకులు దృష్టి సారించాలి..



సర్వే నంబర్ 999, 444, 817, 405, 727లలో రిజిస్ట్రేషన్లు లేకపోవడంతో నిర్మాణాలు లేకుండా పోయాయి. దీంతో పనులు దొరకక వలసలు పోతున్న పరిస్థితి నెలకొంది. గతంలో ఇతర ప్రాంతాలకు చెందిన వందలాది మంది ఇక్కడ పనులకు వచ్చేవారు. ఇప్పుడు అందుకు విరుద్ధంగా మారింది. ఇక్కడివారు పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు.

– బి.కుమార్, పాల్వంచ

బీటీ రోడ్లకు మోక్షం ఎప్పుడో..?

- శంకుస్థాపనకు మూడేళ్లు
- అవస్థలు పడుతున్న ఆదివాసీ, గిరిజనులు



సాయనపేట రోడ్డు



తుమ్మలచెలక రోడ్డు

టేకులపల్లి: టేకులపల్లి మండలం తొమ్మిదోమైలు తండా సాయనపేట, బద్దుతండా పంచాయతీ తుమ్మలచెలక బీటీ రోడ్లకు మోక్షం కలగడం లేదు. శంకుస్థాపన జరిగి మూడేళ్లు అవుతున్నా రోడ్డు నిర్మాణ పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు. దశాబ్దాలుగా రెండు గ్రామాల ప్రజలు పక్కా రోడ్డు కోసం ఎదురు చూస్తున్నారు. ఇల్లెందు – కొత్తగూడెం ప్రధాన రహదారి నుంచి సాయనపేట గ్రామం వరకు ఎస్‌టీఎస్‌డీఎఫ్ 2022–23 నిధులు రూ.70లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి 2023లో అప్పటి ఎమ్మెల్యే బానోతు హరిప్రియ శంకుస్థాపన చేశారు.

పనులు కూడా ప్రారంభం అయ్యాయి. కంకర కూడా పరిచి, రెండు కల్వర్టులు కూడా నిర్మించారు. ఈలోగా ఫారెస్టు అధికారులు అడ్డు చెప్పారు. ఇది రిజర్వు ఫారెస్టు భూమి అని, రోడ్డు నిర్మాణానికి అనుమతులు లేవని పనులను నిలిపివేశారు. దీంతో పనులు నిలిచిపోయాయి. టేకులపల్లి మండలం బద్దుతండా పంచాయతీ తుమ్మలచెలక స్టేజీ నుంచి తుమ్మలచెలక గ్రామానికి ఎస్‌టీఎస్‌డీఎఫ్ 2022–23 నిధులు రూ.17 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి 2023లో అప్పటి ఎమ్మెల్యే బానోతు హరిప్రియ శంకుస్థాపన చేశారు. పనులు కూడా ప్రారంభించారు. కానీ అకస్మాత్తుగా కాంట్రాక్టర్ మధ్యలోనే పనులను నిలిపివేశాడు. సాయనపేట, తుమ్మలచెలక ఈ రెండు బీటీ రోడ్లను కాంట్రాక్టర్ ఒక్కరే. రెండు పనులు ఒకేసారి చేయడం వల్ల యంత్రాలు, మెటీరియల్ పరంగా కలిసి వస్తోంది. సాయనపేట రోడ్డు నిర్మాణం ఫారెస్టు అడ్డంకుల వల్ల నిలిచిపోవడంతో కాంట్రాక్టర్ తుమ్మలచెలక రోడ్డు పనులను కూడా నిలిపివేశాడు. మూడేళ్లుగా ఈ రెండు గ్రామాల ఆదివాసీ, గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బీటీ రోడ్ల నిర్మాణ జరిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు పనులు ప్రారంభించాలి..



2023లో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. దశాబ్దాల తరువాత పక్కా రోడ్డు వచ్చింది అని సంబుర పడ్డాం. సాయనపేటలో రోడ్డు పనులు నిలిచిపోవడంతో కాంట్రాక్టర్ తుమ్మలచెలక రోడ్డు పనులను కూడా నిలిపివేశాడు. వేరే రోడ్డుతో లింక్ పెట్టి మా రోడ్డు పనులు నిలిపివేయడం సరైంది కాదు. సాయనపేట రోడ్డుతో సంబంధం లేకుండా మా రోడ్డు పనులు తక్షణమే ప్రారంభించాలి. ఇల్లెందు ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలి.

– ఊకె రామకృష్ణ, తుమ్మలచెలక

అడ్డంకులు తొలగించాలి...



దశాబ్దాలుగా సాయనపేట గ్రామానికి పక్కా రోడ్డు లేదు. 2023లో బీటీ రోడ్డు మంజూరైంది. చాలా సంతోషించాం. రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. రోడ్డుని తవ్వి కంకర కూడా పరిచారు. ఫారెస్టు అధికారులు వచ్చి అభ్యంతరం చెప్పడంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవ తీసుకుని ప్రభుత్వంతో మాట్లాడి అడ్డంకులు తొలగించి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయించాలి.

– ధనసరి నరసింహారావు దొర, సాయనపేట